ప్రజాశక్తి
శుక్రవారం 6 జూన్ 2025



చింతపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం నుండి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో గాలివాన దాటికి మారుమూల గ్రామాల నుంచి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రం లోని ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్డుపై వరద నీరు చేరడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. గాలివాన ప్రభావంతో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది.


కురుస్తున్న వర్షం

డిపో వద్ద బియ్యం పంపిణీ చేయాలి

- రేషన్ లబ్ధిదారుల నిరసన


నిరసన చేపడుతున్న రేషన్ లబ్ధిదారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం సచివాలయం పరిధి ఐదు గ్రామాలకు రణజిల్ల డిపో వద్ద బియ్యం పంపిణీ చేయాలని ఉప సర్పంచ్ జన్ని భగత్ డిమాండ్ చేశారు. గురువారం దుమ్ముగూడకాలనీ, శారద బొందగూడ, దుమ్ముగూడ, పింపాలగూడ, బొండంగూడ గ్రామస్తులు రేషన్ కార్డులు చూపుతూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ జన్ని భగత్ రామ్ మాట్లాడుతూ, ఈ ఐదు గ్రామాలు కలిపి సుమారు 200 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారన్నారు. గతంలో రణజిల్ల డిలర్ డిపోలో బియ్యం ఇచ్చేవారని, తరువాత ఎండియు ద్వారా ఎండపల్లివలస నుంచి ఐదు గ్రామాలకు ఊరు ఊరు బియ్యం ఇచ్చేవారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినాక మళ్లీ ఎండపల్లివలస డిపోకే కలపడంతో ఈ ఐదు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండపల్లివలస నుంచి బొందంగూడ సుమారు 8 కిలోమీటర్లు ఉందని, డబ్బులు ఉన్న వాళ్లు ప్రవేట్ వాహనాల్లో 50 రూపాయిలు చార్జి ఇచ్చి తీసుకొస్తున్నారన్నారు. డబ్బు లేని వారు కాలినడకన తీసుకెళ్తున్న పరిస్థితి ఉందన్నారు. వృద్ధులకు ఇంటిదగ్గె బియ్యం పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంటికి తీసుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. జిల్లా కలెక్టర్, తహసీల్దార్,స్పందించి రణజిల్ల డిపో వద్ద బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కోర సన్నమ్మ, సోమల కమల, సోమల చంప, జర్నీ దన్ను, స్వామి, కొండన్న, గోపి, రామచందర్, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న బాధితులు

పరిహారం చెల్లించాకే..పనులు చేపట్టండి

-హైవే బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-జి.మాడుగుల :నేషనల్ హైవే 516ఇ బాధితులకు నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని వంజరి గ్రామంలో బాధితులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, జాతీయ రహదారుల బాధితుల సంఘం మండల కన్వీనర్ వంజారి సీతారాం నాయుడు మాట్లాడుతూ, వంజారిలో 50 కుటుంబాలకు ములకాయ పుట్టులో 40, కడగడ్డ గ్రామంలో 10, వరిగెలపాలెం గ్రామం లో 10 కుటుంబాలకు నష్టపరిహారం ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. వీటికి సంబంధించి స్పందనలో కలెక్టర్‌కి వినతి పత్రం ఇచ్చినా ఉపయోగం లేదన్నారు. ఇప్పటికీ 2 సంవత్సరాలు అయినా కూడా ఇప్పటికి నష్ట పరిహారం ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ రెండు సంవత్సరాలు వరి, కాఫీ, విరియాలు, మామిడి తోటల ఆదాయం నష్టపోయామని తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించ లేదని, తమ సాగు భూములలో హైవే పనులు చేయవడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, కలెక్టర్ చొరవ తీసుకొని తమకు నష్టపరిహారం ఇచ్చేవరకు సాగు భూములలో గ్రామాల్లో రోడ్డు పనులు చేయకుండా అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల బాధితుల సంఘం మండల కోకన్వీనర్ వంజరి శ్రీను, వంజరి చిరంజీవినాయుడు, వంజరి రామ్మూర్తి నాయుడు, జర్తా బాబురావు, వంజరి వెంకటలక్ష్మి, వంజరి కనకాలమ్మ, వంజరి భారతమ్మ, కళ్యాణం, బాలయ్య, చిన్నయ్య, హరి, కిల్లో భాస్కర్ పాల్గొన్నారు.



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ఇసంపల్లి వెంకన్న

వెంకన్నకు ఇంజినీరింగ్‌లో డాక్టరేట్

పేదరికాన్ని జయించి పట్టా పొందడంపై పలువురు అభినందనలు

ప్రజాశక్తి ఎటపాక

మండలంలోని నందిగామ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఇసంపల్లి వెంకన్న ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వెంకన్న "బిగ్ డేటా వాతావరణాల్లో పెద్ద డాక్యుమెంట్‌లు, చిన్న గ్రంథాలపై టాపిక్ మోడలింగ్ టెక్నిక్స్ మూల్యాంకనం" అనే అంశంపై జెఎన్‌టియుహెచ్‌లో పరిశోధనను పూర్తి చేశారు. ఈ మేరకు జూన్ 3వ తేదీన హైదరాబాద్ జేఎన్టీయూలో కన్వెన్షన్ ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సమక్షంలో జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఇసంపల్లి వెంకన్నకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు.

కుటుంబ నేపథ్యం : నందిగామ గ్రామానికి చెందిన ఇసంపల్లి రాములు, ఇసంపల్లి బంగారమ్మ దంపతుల ముగ్గురు కుమారుల్లో రెండో కుమారుడు డాక్టర్ వెంకన్న ఇసంపల్లి. పెద్ద కుమారుడు ఇసంపల్లి వెంకటేశ్వరరావు (ఐవి) సిపిఎంలో పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు ఇసంపల్లి కొండయ్య ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తూ గతేడాది అనారోగ్యంతో మరణించారు. వీరిది నిరుపేద కూలీ కుటుంబం. వీరికి సొంత ఆస్తులు అంటూ ఏమీ లేవు. కూలి పని చేసుకుంటేనే కుటుంబం గడిచేది. వెంకన్న "అక్షరాలే ఆస్తిగా, చదువే సంపదగా" భావించి ప్రభుత్వ పాఠశాలల్లోనూ, ప్రభుత్వ హాస్టళ్లలోనూ పట్టుదలగా, కష్టపడి చదివి పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టా సాధించాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఈ ఘనత సాధించినందుకు నందిగామ గ్రామానికి మంచి పేరు తెచ్చినందుకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు వెంకన్నను అభినందించారు.

పుణ్యారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- హుకుంపేట:మండల కేంద్రంలోని కొంతిలి గ్రామ సమీపంలో కామ్రేడ్ పుణ్యారావు నాలుగవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పల నర్స ఘాట్ వద్ద పుణ్యారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా . అప్పల నర్స మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానేత కామ్రేడ్ పుణ్యారావు అని కొనియాడారు. భూ హక్కుల కోసం చేసిన పోరాటంలో జైలుకు వెళ్లినా తన ఆశయాలను వీడలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగం లభించినా, తిరస్కరించి ప్రజల కోసం పోరాటాన్ని ఎంచుకున్నారన్నారు. చివరి వరకు ప్రజల హక్కుల కోసం పోరాడి తన ప్రాణాలను అర్పించిన నేత అని అన్నారు. ఆయన స్ఫూర్తితో ఆయన సతీమణి హైమావతి ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శిగా సామాజిక ఉద్యమాల్లో ముందుండి నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నేతలు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

డిఐజి గోపీనాథ్, కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. గంజాయి సాగును జీరో స్థాయికి తీసుకు వెళ్ళడమే అందరి లక్ష్యం కావాలని స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, విద్యా, ఐసిడిఎస్, డ్వామా, డి.ఆర్.డి.ఏ శాఖల అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలు, రవాణా, పంపిణీ, వినియోగం, వ్యసన విముక్తి మొదలగు అంశాలపై లోతుగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలు, వసతి గృహాల విద్యార్థులకు గంజాయి వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులుపై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అన్ని సమావేశాలలో గంజాయి నిర్మూలనపై చర్చించాలని సూచించారు. గంజాయి పూర్తి స్థాయి నిర్మూలనకు సచివాలయం యూనిట్ గా తీసుకుని గంజాయి సాగుదారులను గుర్తించి వారికి గంజాయి సాగు నుండి విముక్తికి అవసరమైన అంశాలతో సూక్ష్మ ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, బ్యాంకు శాఖలను ఆదేశించారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు.

డి.ఐ.జి గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ జిల్లాలో గంజాయిని సమూలంగా అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రోన్ ల ద్వారా గుర్తించిన గంజాయి సాగును ధ్వంసం చేసినా తిరిగి అదే సాగు చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నిర్మూలనలో భాగమైన ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేసారు. సమాజంలో గంజాయి నిర్మూలనపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంత చేయాలని చెప్పారు. జిల్లాలో గంజాయి నిర్మూలన జరిగినప్పటికీ ఇతర రాష్ట్రాల నుండి మన జిల్లా మీదుగా రవాణా జరుగుతుండడం గుర్తించామన్నారు. త్వరలోనే ఆంధ్ర, ఒరిస్సా, చతిష్ఘర్ రాష్ట్రాలతో అంతర్ రాష్ట్ర సమావేశాలు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుండి గంజాయి రవాణాను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆంధ్రా ఒరిస్సా సరిహద్దుల వెంట 26 చెక్ పోస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల ఏడు కేసులలో వారి ఆస్తులను సుమారు రూ.10 కోట్ల వరకు జప్తు చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ళలో సుమారు 60 కేసుల వరకు పది సంవత్సరాలకు తక్కువ కాకుండా శిక్షలు పడ్డాయన్నారు. 45 అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాలను గుర్తించామని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామని డిఐజి వివరించారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ ఇటీవల గత ఆరు నెలలుగా పోలీస్ శాఖ చేపట్టిన చర్యల వల్ల గంజాయి సాగు, రవాణా తగ్గుముఖం పట్టిందన్నారు. 18 కేసులు గుర్తించి 9,500 కేజీల గంజాయి సీజ్ చేయడం, 280 మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఆధునిక సాంకేతికత ఉపయోగిస్తున్నామన్నారు. పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అదనపు ఎస్పీ ధీరజ్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, ఆసుపత్రి పర్యవేక్షకులు విశ్వమిత్ర పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డుకు ప్రవర్ధిని ఎంపిక

ప్రజాశక్తి-అడ్డతీగల

స్థానిక అనూప్ కాలేజీలో చదువుతున్న విద్యార్థి ప్రవర్ధిని ఎంపి ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చీకట్ల ఆశీర్వాదం తెలిపారు. చింతూరు మండలం మురుమూరు గ్రామానికి చెందిన ప్రవర్ధిని ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంపిహెచ్‌డబ్ల్యులో 1000 మార్కులకు 927 మార్కులు సాధించి జిల్లాలోనే ఒకేషనల్ గ్రూపుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 9వ తేదీ పాడేరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, అధికారులు చేతులు మీద బంగారు పతకం, రూ.20వేలు నగదు అందించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం తెలిపారు. ఈ కళాశాల నుండి ఈ ఏడాది ద్వితీయ ఇంటర్‌లో మొత్తం 140 మంది పరీక్షలు రాయగా, 800- 900 మధ్య మార్కులు 12 మందికి, 700-800 మధ్యలో మార్కులు 72 మందికి వచ్చినట్లు చెప్పారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రవర్ధిని రాబోయే చదువుకు కూడా కాలేజీ ఆర్థికంగా సహకారం అందించడంతో పాటు, ఉచితంగా తమ కాలేజీలో స్టాఫ్ నర్సింగ్ సీటు ఇస్తున్నామని తెలిపారు.


ప్రవర్ధిని



ట్రైలర్‌ను ఆవిష్కరిస్తున్న నటుడు రాజేంద్రప్రసాద్

'పాడేరు 12వ మైలు'లో ఏముంది ?

-నేడే విడుదల - పాడేరుకు చెందిన దర్శక, నిర్మాతల సారథ్యం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు 12వ మైలురాయి జంక్షన్ తెలియని వారు ఉండరు. ఘాట్ రోడ్లో నిత్యం ప్రయాణించే వారికి ఈ జంక్షన్ చాలా సుపరిచితం. ప్రస్తుతం ఈ జంక్షన్ వివిధ రకాల ఫలసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కు ప్రసిద్ధికెక్కింది. ఇప్పుడు ఈ "పాడేరు 12వ మైలు" అనే పేరుతో ఒక ప్రేమ కథ చిత్రాన్ని సాయి లక్ష్మి గణపతి మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై పాడేరు కు చెందిన యువ నిర్మాత గ్రంధి త్రినాథ్ నిర్మించారు. మన్య ప్రజల ఇలవేల్పు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి ఇతివృత్తాన్ని జోడించి ఉత్కంఠ భరితంగా సాగే ప్రేమ కథ చిత్రాన్ని పాడేరుకు చెందిన యువ దర్శకుడు ఎన్. కె.సాయి తమ అభిరుచి మేరకు పాడేరు సమీప అందమైన పరిసరాల్లో ఆసక్తికరంగా చిత్రీకరించారు. పాడేరు కు చెందిన ఈ నవ యువ దర్శక నిర్మాతలు తమ తొలి ప్రయత్నంగా" పాడేరు 12వ మైలు " చిత్రాన్ని రూపొందించడం పట్ల ఈ ప్రాంతంలోని ప్రముఖులు, వర్తకులు ప్రజా ప్రతినిధులు అభినందిస్తూ ఈ చిత్రం విజయవంతం కావాలని అభిలషిస్తున్నారు.

ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో ఈ చిత్రాన్ని 18 థియేటర్లలో ఈనెల 6న శుక్రవారం విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం, ట్రైలర్ ను ఇటీవల 'నటకిరీటి' 'రాజేంద్రప్రసాద్' విడుదల చేశారు. ఈ "పాడేరు 12వ మైలు" చిత్రంలో నూతన ఆర్టిస్టులతో పాటు "జబర్దస్త్" నటీనటులు, సత్యం రాజేష్, శ్రవణ్ , కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు ఈ చిత్రంలో నూతన నటి సుహాన హీరోయిన్ గా పరిచయం కాబోతున్నారు. కో ప్రొడ్యూసర్ గా లోతేటి కృష్ణ చిత్ర నిర్మాణానికి తోడ్పాటు ఇచ్చారు. ట్రైలర్ రిలీజ్ చేసిన సందర్భంగా నటుడు హీరో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, పాడేరు 12వ మైలు సినిమా అందరిని అలరిస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా దర్శక, నిర్మాతలకు మంచి పేరు రావాలని, ఇలాంటి మరిన్ని కొత్త కాన్సెప్ట్ సినిమాలు రావాలని కోరుకుంటున్నానని అన్నారు.

నిర్మాత గ్రంధి త్రినాథ్ మాట్లాడుతూ...పాడేరు 12వ మైలు సినిమా ఆశించిన రీతిలో బాగా తీయగలిగామని, డైరెక్టర్ , యాక్టర్స్ అందరూ బాగా సపోర్ట్ చెయ్యడంతోనే మా సినిమా మంచి కలర్ ఫుల్ గా వచ్చిందన్నారు. ప్రేక్షకులు, మా సినిమాను తప్పకుండా పాజిటివ్ గా రిసీవ్ చేసుకుంటారనే నమ్మకం ఉందని, ఇదివరకు తాము విడుదల చేసిన టీజర్, సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ లభించిందని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్ శివ శర్వాని సినిమాటోగ్రఫీ జి.అమర్ అందిస్తున్నారు. హైదరాబాద్, వైజాగ్, పాడేరు లో అధిక భాగం షూటింగ్ జరుపుకున్న ఈ సినిమాకు పీఆర్ నేపథ్య సంగీతం అందించారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి-పెదబయలు:ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్థానిక తహసీల్దార్ జీ రంగారావు సూచించారు. గురువారం తన ఛాంబర్ నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే తొలగించాలన్నారు.షాప్ యజమానులు షాపులు తొలగించక పోతే ప్రభుత్వమే శాఖాపరమైన చర్యలు తీసుకొంటుందని తహసీల్దార్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

-కరెంట్ సరఫరా లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

-నుజ్జునుజ్జు అయిన బస్సు క్యాబిన్



వృత్తాకారంలో వంగిన స్తంభం, నుజ్జు అయిన బస్సు కేబిన్


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు, బస్సుపై పడిన విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి -సీలేరు, మోతుగూడెం

పాడేరు డిపోకు చెందిన పాడేరు-భద్రాచలం బస్ సర్వీస్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో బస్సు క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ఈ సమయంలో విద్యుత్ నిలుపుదల చేసి ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. పాడేరు డిపోకు చెందిన బస్సు భద్రాచలం నుండి డొంకరాయి, సీలేరు మీదగా పాడేరు వస్తుండగా గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ ఒడియా క్యాంప్ ఊరు దాటిన తరువాత మలుపు వద్ద స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో బస్సు 33 కెవి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 11 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. అయితే దిగుసీలేరు డొంకరాయి ఏపీ జెన్కో డిస్ట్రిబ్యూషన్ ఇంజనీర్లు సిబ్బంది 33 కెవి డొంకరాయి జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఎల్‌సి అనుమతులు తీసుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండి ఉంటే తీవ్ర ప్రాణ నష్టం జరిగేది. సంఘటన జరిగిన అనంతరం ఒడియా క్యాంపు పరిసరాల్లో ఉన్న ప్రజలు సంఘటన ప్రదేశానికి చేరుకొని ప్రయాణికులను సురక్షితంగా బయటికి దించారు. ప్రయాణికులను వేరొక బస్సు ఎక్కించి పంపించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పలువురు అంటున్నారు. ప్రమాద మలుపు వద్ద నెమ్మదిగా బస్సు నడిపి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని చర్చించుకుంటున్నారు.


కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సంతోష్‌కుమార్

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి రామగిరి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొక్కనపల్లి గ్రామస్తులు చుట్టూ తిరిగి మండలానికి వెళ్ళాలంటే చాలా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఈ రహదారి పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎన్‌ఆర్‌ఇజిఎస్ నుంచి ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పూసం రవివర్మ, పీసా కమిటీ కార్యదర్శి కారం రాముడు, గ్రామస్తులు గుండిపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్య నారాయణ, నల్లారపు రాజేశ్వరి, కమ్మచిచ్చు చిన్న వెంకటయ్య, ఎన్ బాలాజీ, అయినాల గోపి, సోడి శ్రీను, తోడం వెంకటేష్, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి స్థలాల గుర్తింపు

ఆందోళన చెందుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల కేంద్రమైన కొయ్యూరు, రాజేంద్రపాలెం, సింగవరం గ్రామాల్లోని ఆర్ అండ్ బి రోడ్డుకు అటు ఇటు ఉన్న ఆ శాఖ స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తిస్తూ మార్కింగ్ చేస్తున్నారు. దీంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి ఆ స్థలాలనే నమ్ముకుని వ్యాపారాలు చేస్తూ బతుకుతున్న తమను ఉన్న ఫలంగా ఆ స్థలాల నుండి ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటే తమ బతుకు తెరువు అగమ్యగోచరం, అయోమయంగా మారిపోతుందని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, కానీ స్థలాల సేకరణలో వెనులుబాటు కల్పించాలని, గతంలో అధికారులు ఈ రోడ్డు కొలతలు కొలిచారని, అప్పటికీ ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉందని, దీనిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వే వల్ల రోడ్డున పడే కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను పలువురు కోరుకుంటున్నారు. మండల కేంద్రంలో జరిగిన స్థలాల గుర్తింపు ప్రక్రియ వద్దకు వచ్చిన డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామి, సిబ్బంది, సర్వేయర్లు మాట్లాడుతూ తమకు ఎవరి మీద కక్షలు ఉండవని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఎఫ్‌ఎంబి ప్రకారం ఆర్ అండ్ బి స్థలాన్ని గుర్తిస్తున్నట్టు తెలిపారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాల మేరకు 6(1) నోటీసులు వ్యాపారులకు అందజేయనున్నట్టు వారు చెప్పారు.


రహదారికి ఇరువైపులా కొలతలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

3 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-మోతుగూడెం

వై రామవరం మండలం, డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం డొంకరాయి ఎస్సై శివకుమార్ వచ్చిన సమాచారం మేరకు డొంకరాయి గ్రామ శివారులో అనుమానాస్పదంగా తిరుకుతున్న లంకదాసి శివ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆయన 3 కేజీల గంజాయిని ఒడిశా రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలింది. నిందితుడు లంకదాసి శివ కుమార్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


పట్టుబడిన గంజాయి, నిందితునితో పోలీసులు

ఘనంగా పర్యావరణ దినోత్సవం


చింతపల్లిలో మొక్క నాటుతున్న అధికారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

దుంబ్రిగుడ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అప్పుడే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అంజోడ సిల్క్ ఫారం అరకు పైనరిలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముందుగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే మత్స్యలింగం, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజనల్ చైర్మన్ దొన్నుదొర మొక్కలను నాటారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వలన చేసి, వాల్ పోస్టర్లు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం అల్లూరి జిల్లా వ్యాప్తంగా 27 లక్షల మొక్కలు 11 హెక్టార్ లలో నాటడానికి చర్యలు తీసుకున్నామని, ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని శాఖలను కలుపుకొని 8కోట్లు మూడు లక్షల 45వేల మొక్కలను నాటడం జరుగు తుందన్నారు. పర్యావరణం ప్రస్తుతం ప్రమాదకరంగా ఉందని, దీన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని మొక్కలు నాటడం తో పాటు చదువుకున్న విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

డిఎఫ్ఓ సందీప్ రెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతింటుందని చెప్పారు. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ చైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ఒక ఉద్యమం లాగా పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ సర్పంచ్ పి.కొమ్ములు, ఎంపిటిసి దేవదాసు, టిడిపి మండల అధ్యక్షుడు కే.ఆనందరావు, అరకులోయ పెదలబుడు సర్పంచ్ దాసు బాబు, జనసేన పార్టీ అరకు నియోజకవర్గం ఇంఛార్జి చిరంజీవి, అటవీ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. తహసీల్దార్ కార్యాలయం నుండి ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు అనంతరం శిశు సంక్షేమ శాఖ కార్యాలయం సమీపంలో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, అటవీశాఖ రేంజ్ అధికారి కెవి రాజేశ్వర్రావు, ఎంపీడీఓ పూర్ణయ్య, ఎంపీపీ వరహాలమ్మ, వైస్ ఎంపీపీ రాజుబాబు, జడ్పీటీసీ బొంజుబాబు, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ మండల ఫోరమ్ అధ్యక్షులు కె బొంజుబాబు పాల్గొన్నారు.


చింతూరులో....

చింతపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల-1 ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.అటవీశాఖ చింతపల్లి డివిజన్ అధికారి వై.వి. నర్సింగరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ లేకుండా మనుగడ సాధ్యం కాదన్నారు. ఇన్చార్జ్ తహశీల్దార్ టి. రామకృష్ణ, ఎస్ఐ ఎం. వెంకటరమణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కో మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురు పోతురాజు బాలయ్య, అటవీ శాఖ చింతపల్లి రేంజ్ అధికారి అప్పారావు, డిప్యూటీ రేంజ్ అధికారి దేవరాజు వెంకటరాజు, మండల విద్యాశాఖ అధికారులు పనసల వీర వెంకట వరప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్, డిప్యూటీ తహశీల్దార్ గిడ్డి రాజ్ కుమార్, బీట్ ఆఫీసర్లు మండి భూషణం, పుష్ప పాల్గొన్నారు.

అనంతగిరి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎవివి.కుమార్ ఆధ్వర్యంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పథకం ద్వారా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి పాల్గొని పంట కుంటలలో మండలంలోని చిలకలగెడ్డ పంచాయితీ వెంకయ్యపాలెం గ్రామంలో పంట కుంటల వద్ద మొక్కలను ఆమె నాటారు. చెరువుల వల్ల పంటలకు నీరు అందడంతో పాటు భూగర్భ జలాలు సంరక్షింపబడతాయని వాటి గట్లపై మొక్కలను పెంచడం ద్వారా గట్టు కోతకు గురి అవకుండా ఉండడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడతాయని ఆమె అన్నారు. ఈ మేరకు మండలంలో ఉన్న 24 పంచాయతీ పరిధి గ్రామాల్లో 8000 మొక్కలను పంట కుంటల వద్ద నాటుతున్నట్లు తెలిపారు.అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ టి. మిఠల, ఏపీఓలు నాయుడు, అర్జున్ పలువురు నాయకులు సుబ్బారావు, భీమరాజ్, జగన్, చంటి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయితీ తోటవలస గ్రామంలో సెక్రటరీ మహేంద్రరెడ్డి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తేనే మానవజాతికి మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత బోరి బోరి రామ్మూర్తి,పేసా కమిటీ ఉపాధ్యక్షులు కొర్ర మోహన్ రావు, ఉపాధి హామీ పథకం టిఎ కమల ,విఆర్ఓ రంభమణి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలం గన్నేరు పుట్టు పంచాయితీ లో ఐటీడీఏ కాఫీ డిపార్ట్ మెంట్, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయంలో పర్యావరణాన్ని దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. గన్నేరు పుట్టు పంచాయితీ లో వైస్ ఎంపీపీ, సర్పంచ్ సోకేలి కృష్ణా రావు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమం లో హార్టికల్చర్ ఆఫీసర్ కే వాణి, లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐటిడిఎ ఇంఛార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐటిడిఎ కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ,అన్ని ప్రభుత్వ కార్యాలయ ఆవరణ, పాఠశాలల్లోను, అంగన్వాడీ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. అడవులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యు డిడి ఎల్. రజని, పరిపాలనాధికారి ఎం.హేమలత, డిఎంహెచ్ఒ జమాల్ బాషా పాల్గొన్నారు.

పాడేరు:- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాడేరు డివిజన్ మినుములూరు పెదబయలు ఏపి ఎఫ్ డి సి ఎస్టేట్లలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మురళీధరన్, ఏపీ ఎఫ్ డి సి డిఎం కృష్ణబాబు, నర్సీపట్నం డి ఎం సత్యం, డిఎం అండ్ హెచ్ ఓ జమాల్ బాషా, కాఫీ బోర్డు ఎస్ఎల్ఓ రమేష్, పీహెచ్సీ వైద్యాధికారి సాయి శ్రీ తదితరులు మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో మినుములూరు ఏపీ ఎఫ్డిసి రేంజర్ సుదర్శన్ రావు, సర్పంచ్ లంకెల చిట్టమ్మ ,మాజీ సర్పంచ్ కన్నపాత్రుడు, మాజీ సర్పంచ్ పాలికి లక్కు సవిలాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: ఏజెన్సీలో కాఫీ తోటలను మరింత విస్తరింపచేయానికి కృషి చేస్తానని ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. పాడేరు మండలం గుర్రగరువు గ్రామంలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని కాఫీ మొక్కలను నాటారు. ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వర్రావు, పాడేరు ఎంపిపి సోనారీ రత్నకుమారి, ఎజిఒ రూడీ అప్పారావు, కాఫీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా మొక్కలు నాటాలని రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. గంగవరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నవ్యాంధ్ర ప్రదేశ్ మొక్కలు నాటే కార్యక్రమానికి గురువారం ఆమె హాజరయ్యారు. వివిధ రకాలైన మొక్కలు నాటారు. రంపచోడవరం డీఎఫ్ఓ రవీంద్ర ధామ, సబ్ డిఎఫ్ఓ అనూష, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్, జడ్పిటిసి పల్లాల కృష్ణారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి జెవి.సుబ్బారెడ్డి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, స్థానిక నాయకులు పాము అర్జునుడు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు అప్పారావు, నూకరాజు దొర తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిఎఫ్ఓ సబితా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ తదితరులు స్థానిక ఏజిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ కె.ఆజాద్, డిఆర్ఓ ఏ శ్రీనివాసరావు, ఎస్ ఎఫ్ వీరభద్రయ్య, శివచంద్ర ఎస్బిఓ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పావని, వార్డెన్ లత, టిడిపి నాయకులు ఏండి జహంగీర్, పి సాలమన్ రాజు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, రేంజ్ అధికారి ఉషారాణి, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, సీఐ ఎన్ సన్యాసినాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో స్థానిక అటవీశాఖ రేంజ్ అధికారి జి ఉషారాణి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వాటి పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు డి శివరామచంద్రరాజు, ఎంఈఓ సూరారెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ రెడ్డి బాబు, అటవీ శాఖ సిబ్బంది పీసా కమిటీల మండల అధ్యక్షులు తాము సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి ప్రభుత్వ కార్యాలయాల వద్ద బహిరంగ ప్రదేశాలలోనూ వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ గొర్లె అనుదీప్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుదాం పచ్చదనాన్ని పరిరక్షిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కానెం విజయలక్ష్మి, సంస్థ డైరెక్టర్ అనుదీప్ కుమార్ పాల్గొన్నారు.


పాడేరులో మొక్క నాటుతున్న జెసి

సీలేరు : పచ్చని చెట్లు లేకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఏపీ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి ఈఈ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ పాంగి దుర్గో, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కూటమి నాయకులు అప్పలరాజు ఏపీ జెన్కో ఏఈ సురేష్, డిప్యూటీ రేంజ్ అధికారి సింహాచలం పడాల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ సత్తిబాబు, మాజీ ఉపసర్పంచ్ కారే శ్రీనివాస్, కాంట్రాక్టర్ నీలము రమణ, పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో కూనవరం సీహెచ్సీ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సి.తేజ ఫార్మసిస్ట్ తుష్టి జోగారావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్సీ కౌన్సిలర్ కె రమేష్, తులసి, తేజ, తెల్లం ప్రసాద్, కూర జోగయ్య ల్యాబ్, టెక్నీషియన్ నగేష్, మరియమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎపిఒ

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రంలో కొయ్యూరు ఉపాధి హామీ ఎపిఓ, ఫీల్డ్అసిస్టెంట్తో కలసి గురువారం రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా ఇస్తున్న ఈ మొక్కలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తోట దొరబాబు, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, బుదరాళ్ల పండు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్లిం యువతి నిఖాకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు బిసి కాలనీకు చెందిన ఎస్కె.రంజాన్ కుమార్తె నిఖా (వివాహం) నిమిత్తం జెకెసి ట్రస్టు చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ రూ.60వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని రంజాన్ దంపతులకు ట్రస్ట్ ద్వారా చెక్కు రూపంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన ఆడపిల్లల వివాహాల నిమిత్తం తమవంతు సహాయంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఇన్ఛార్జి జావేద్, సీనియర్ టిడిపి నాయకులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పి.సాల్మంరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే జోన్ జిఎంగా సందీప్ మాథూర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేసిన సౌత్ కోస్ట్ రైల్వే తొలి జనరల్ మేనేజర్గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీర్స్, హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్కు చెందిన సందీప్ మాథూర్ను నియమిస్తూ రైల్వే బోర్డ్ జాయింట్ సెక్రటరీ విక్రమ్ సింగ్ దాహియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సందీప్ మాథూర్ సిగ్నల్ మోడర్నైజేషన్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. విశాఖ రైల్వే జోన్కు జనరల్ మేనేజర్ను నియమించాలని జనవరి 21న విశాఖ ఎంపీ శ్రీభరత్ రైల్వే మంత్రికి లేఖ రాశారు. జోన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలంటే కచ్చితంగా జిఎం అవసరమని దానిలో విన్నవించారు. ఆ లేఖకు కేంద్రం స్పందించినట్టు శ్రీభరత్ గురువారం చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాల్తేరు డివిజన్తో కూడిన రైల్వే జోన్ సాకారమైందని, త్వరితగతిన గజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ డిఆర్యుసిసి మెంబర్ చలసాని గాంధీ, రైల్వే సంఘాల నాయకులు శ్రీభరత్కు ధన్యవాదాలు తెలిపారు.

మత్స్యకారులంటే చంద్రబాబుకు చిన్న చూపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్యకారులు అంటే చంద్రబాబుకు చిన్న చూపు అని, వారి హక్కులను కాలరాస్తున్నారని వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. గురువారం 34వ వార్డుకు చెందిన మత్స్యకారుడు అరిజాల అప్పారావు కుమారుడు యశ్వంత్ విద్యకు తన సొంత నిధులు రూ.10 వేలను గణేష్ కుమార్ ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల్లో నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు. అందువల్ల చేసుకునే వృత్తిలో కూడా వారు మోసాలకు బలైపోతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు అందాల్సిన జీవనభృతి, మత్స్యకార భరోసాను అర్హులందరికీ ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రేసు అనురాధ, ఎర్రమ్మ తల్లి, లండ రమణ, అంబటి అప్పలరాజు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అంచనాలు పెంచేశారు..!

- ఎపి టూరిజం హరిత రెస్టారెంట్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- 2023లో రూ.8 కోట్లు.. కొత్త ప్రభుత్వంలో రూ.13.5 కోట్లు
- నిధులు కొల్లగొట్టే చర్యలు
- అమరావతి నుంచి చక్రం తిప్పిన అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దుబారా జరగకుండా పాలన సాగిస్తామంటూ ఎన్నికల సమయంలో చెప్పుకొచ్చిన 'కూటమి' అధికార పీఠం దక్కాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. విశాఖ నగర నడిబొడ్డున సీ వ్యూ (అప్పుఘర్) వద్దగల ఎపి టూరిజానికి చెందిన హరిత హోటల్, రెస్టారెంట్ అండ్ బార్ మరమ్మతులు, పునర్నిర్మాణానికి సంబంధించి నిధుల అంచనాలను రూ.కోట్లకు పెంచేసిన వైనమే దీనికి తార్కాణం. ఎపి టూరిజం విశాఖ జిల్లా అధికారులకు కనీసం కాగితంపై కూడా సమాచారాన్ని అమరావతి ఎపి టూరిజం ఇంజినీరింగ్ అధికారులు ఇవ్వకుండా మరమ్మతుల పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టే చర్యలకు దిగారన్నది స్పష్టమవుతోంది.



అప్పుఘర్లోని హరిత హోటల్ అండ్ రెస్టారెంట్

నాడు ఎంత ? నేడు ఎంత ?

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అప్పుఘర్ వద్దగల హరిత హోటల్, రెస్టారెంట్ అండ్ బార్ (ఎసి అకామడేషన్)లో మరమ్మతు పనులను గత ప్రభుత్వం రూ.8.6 కోట్లతో 2023లో ప్రారంభించింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.13.5 కోట్లుగా సవరించిన అంచనాలతో పనులకు శ్రీకారం చుట్టింది. సుమారు రూ.5.50 కోట్ల మేర అంచనాలను పెంచేయడం వెనుక అమరావతి ఎపి టూరిజం అధికారుల హస్తం ఉంది. విశాఖపట్నం జిల్లా ఎపి టూరిజం రీజనల్ డైరెక్టర్ జగదీష్ను ఈ విషయమై 'ప్రజాశక్తి' వివరాలు కోరగా అంతా అమరావతి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతోందని, తమకు తెలియదని తెలిపారు. 8 సెంట్ల స్థలంలో ఉన్న ఈ భవనాన్ని ఉన్న ఫలంగా ధ్వంసం చేసి కొత్తగా నిర్మాణం చేసినా ఇంత ఖర్చవుతుందా ? అంటూ స్థానికులు పెదవి విరుస్తున్నారు.

మొత్తం పనులన్నింటినీ చేపడుతున్నాం : అసిస్టెంట్ ఇంజినీర్ సీతారామ్

ఎపి టూరిజానికి చెందిన అసిస్టెంట్ ఇంజినీరు సీతారామ్ హరిత రెస్టారెంట్ పునర్నిర్మాణ పనులపై స్పందిస్తూ 2023 అక్టోబర్లో రూ.8.6 కోట్లతో అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించామని, తాజాగా రూ.13.5 కోట్లకు అంచనాలు పెరిగాయని అన్నారు. పూర్తిస్థాయి పునర్నిర్మాణ పనులు జరుగుతున్నందున భారీగా నిధుల వ్యయం పెరిగిందన్నారు. మరో నెల రోజుల్లో సర్వ హంగులతో హరిత రెస్టారెంట్ సిద్ధం కానుందని తెలిపారు.

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

గత లోపాలు పునరావృతం కారాదు
సమీక్షా సమావేశంలో విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జులై 9, 10వ తేదీల్లో ఆషాఢ పౌర్ణమి రోజున జరిగే శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు జాతీయ రహదారిని దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్, సిపి శంకబ్రత బాగ్చీ అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎన్హెచ్ఎఐ వారితో సమన్వయం చేసుకొని తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూలైన్లను పక్కాగా ఏర్పాటు చేయాలని, గాలి, వానలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై మాట్లాడారు. జులై 9న తెల్లవారు జాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు దర్శనాలు ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కొండదిగువ తొలి పావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్ను క్రమబద్ధీరించేందుకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, తోపులాటలు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ముందుగానే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ఇఒ సూచనల మేరకు అవసరమైన అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ కొనసాగాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్పుఘర్ వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేసే సమయంలో ఏ విధమైన నీటి ప్రమాదాలూ జరగకుండా ఉండేందుకు మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్టిసి అధికారులకు సూచించారు. సమావేశంలో భాగంగా ప్రధాన అర్చకులు వైదిక కార్యక్రమాల షెడ్యూల్ను వివరించారు.


ఆర్థికసాయం అందించిన ప్రతినిధులు

సికిల్సెల్ ఎనీమియా బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యురు మండలం గోపవరం గ్రామానికి చెందిన బాలిక దవల భాగ్య శ్రీ సికిల్ సెల్ ఎనీమియతో బాధపడుతుండగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. భాగ్యశ్రీని ఆసుపత్రికి తీసుకెళ్లే ఆర్థిక స్తోమత లేకపోవడంతో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు దాతలు ద్వారా రూ.10 వేలు నగదు, పండ్లు అందజేశారు. పాప తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు టి మల్లేష్, కె.హరిదేవ్, యు.లక్ష్మణ్ మాస్టర్, చిన్న (ల్యాబ్ ఇన్ఛార్జి) పాల్గొన్నారు. సహాయం అందించిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను కేంద్రం రద్దు చేసిందని, తక్షణమే వాటిని పునరుద్ధరించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఎజె) గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ డిమాండ్ చేశారు. ఆ చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 9న జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించే వివిధ కార్యక్రమాలకు వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్కాస్ట్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. గురువారం డాబాగార్డెన్స్ కూడలిలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేయగా అందులో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపుల చట్టం 1958 ఉన్నాయన్నారు. వాటి రద్దుతో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కోనున్నారన్నారు. వీటి పునరుద్ధరణకు కేంద్రం చర్యలు చేపట్టాలని కోరారు.

అలాగే ఈ నెల 11న జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న తరుణంలో వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన అనేక అంశాలను పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అందుకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఆ రోజు జిల్లా కలెక్టరేట్లోనూ, తహశీల్దార్ కార్యాలయాల్లోనూ, అలాగే ప్రజాప్రతినిధులకు అందజేస్తామన్నారు. సమావేశంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్కాస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ధవళేశ్వరపు రవికుమార్, సాంబశివరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రతిపాదనలు అభినందనీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందన, ప్రతిపాదనలు అభినందనీయమని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కెఎస్.చలం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం అభివృద్ధిపై కేంద్ర మంత్రి చూపిస్తున్న శ్రద్ధ, చేపట్టిన కార్యాచరణ ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా పాతపట్నం అమ్మవారి గుడి మీదుగా వెళుతున్న బ్రిడ్జి డిజైన్ మార్చి గుడికి అడ్డులేకుండా వుండాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరడం మంచిదేనన్నారు. నరసన్నపేట నుండి ఇచ్ఛాపురానికి ఆరు లైన్లు రోడ్డు కావాలని కోరడం శుభపరిణామమన్నారు. అయితే అది శ్రీకాకుళం నుంచి ఉంటే బావుటుందన్నారు.